క్లుప్తంగా

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పలువురు మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, గాజులు, చీరలు ముడుపుల రూపంలో చెల్లించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మంజునాథ్‌కు బాల చిత్రకళ అవార్డు



అవార్డు అందుకుంటున్న మంజునాథ్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థి మంజునాథ్ బాల చిత్రకళ అవార్డును అందుకున్నారు. ఆదివారం విజయవాడలోని డ్రీమ్స్ ఆర్ట్ అకాడమీ వారు తుమ్మలపల్లె కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ చిత్రకళ ప్రదర్శన పోటీల్లో మంజునాథ్ మహాత్మాగాంధీ చిత్రాన్ని అద్భుతంగా గీచి అవార్డు దక్కించుకున్నారు. దాదాపు 3వేల మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో మంజునాథ్ అద్భుత కళ ప్రదర్శించడంతో కళాక్షేత్రం చిత్రకారులు రమేష్, కళాసాగర్ అవార్డు అందజేశారు.

ఆర్బీకే నిర్మాణానికి స్థలం విరాళం



ఆలమూరులో ప్రారంభానికి సిద్ధమైన ఆర్బీకే

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో బుడ్డాశెట్టి రామకృష్ణ కుటుంబ సభ్యులు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి ఎనిమిది సెంట్ల స్థలం విరాళంగా అందజేశారు. సోమవారం ఆర్బీకే భవనాన్ని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు, ఆ గ్రామ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వం గ్రామంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. అయితే రెవెన్యూ అధికారులు గ్రామ సచివాలయ భవనం నిర్మించేందుకు మాత్రమే ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆర్బీకే భవనం నిర్మించేందుకు స్థల సమస్య నెలకొంది. ఇందుకు తగిన స్థలం ఎక్కడా లభించలేదు. విషయం తెలుసుకున్న బుడ్డాశెట్టి రామకృష్ణ కుటుంబ సభ్యులు స్పందించి గ్రామ సచివాలయం భవనం పక్కనే ఉన్న వారి స్థలంలో నుంచి దాదాపు రూ.8లక్షల విలువ చేసే ఎనిమిది సెంట్ల స్థలం కేటాయించారు. వెంటనే ఆ స్థలంలో భవన నిర్మాణం పూర్తి చేశారు. ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన శిలా ఫలకంలో స్థల దాత పేరు వేయించినట్లు సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర, నాగేష్, ప్రభాకర్,జయరాముడు తెలిపారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

నంద్యాల(అర్బన్): ఐకమత్యంతోనే వాల్మీకుల సంఘం అభివృద్ధి సాధ్యమని వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున సంఘం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. స్థానిక బొగ్గులైన్ ప్రాంతంలోని వాల్మీకి సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సిద్ధించి 70ఏళ్లు అవుతున్నా బోయలు నేటికీ అభివృద్ధి చెందడం లేదన్నారు. నాయకులు రమేష్, ఎల్ల సుబ్బు, టైలర్ శేఖర్, శేఖర్, హనుమంతు, గోపాల్, కిరణ్ పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



సంగమేశ్వరం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని సంగమేశ్వరం క్షేత్రం, గోపవరం గ్రామాల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ పర్యటన దృష్ట్యా ఆదివారం నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆత్మకూరు నుంచి గోపవరం, సంగమేశ్వరం క్షేత్రాలకు వెళ్లి ఏర్పాట్లును పర్యవేక్షించారు. పోలీస్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ శృతి, సీఐ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ముంగిట పాలన..

- క్రిష్టిపాడు, బుర్రారెడ్డిపల్లెలో రూ.1.20 కోట్లతో నూతన కార్యాలయ భవనాలు నిర్మాణం
- 28న ప్రారంభించనున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

క్రిష్టిపాడులో ఒకే ప్రాంగణంలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం



దొర్నిపాడు: ఇదిగో గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం వచ్చేసింది. పల్లెల్లో నూతన ప్రభుత్వ కార్యలయాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఇక నుంచి నూతన కార్యలయాల్లో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందబోతున్నాయి. అత్యాధునిక వసతులతో ఎంతో సుందరంగా మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో గ్రామ సచివాలయం, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, బుర్రారెడ్డిపల్లెలో గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు.

ముంగిటకే పాలన..

దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తెచ్చింది. అవినీతికి, వివక్షతకు తావు ఇవ్వకూడదని పరిపాలన అన్నది ప్రజలకు మరింత చేరువ కావాలనే ప్రధాన ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 పైగా సేవలను కేవలం 15 నిమిషాల నుంచి 72 గంటల్లోపే పరిష్కరిస్తున్నారు. రూ.40 లక్షలతో గ్రామ సర్పంచ్, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వేల్ఫేర్, మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ప్రజలు వీక్షించేందుకు ప్రత్యేక హాలు ఇలా వివిధ శాఖలకు సంబధించి ప్రత్యేకంగా గదులను సుందరంగా తీర్చిదిద్దారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం..

గ్రామీణులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని రూ.17.60 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 12 రకాల వైద్యసేవలు, 14 రకాల వైద్య పరీక్షలు అందబోతున్నాయి. 65 రకాల మందులు, టెలి మెడిసిన్‌సేవలు, 67 రకాల వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. బీఎస్సీ నర్సింగ్ అర్హత కల్గిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌ను, సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అక్కడే ఉంటారు. గ్రామీణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దూరంగా ఉండటంతో పల్లెలోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు కావడంతో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని రకాల టీకాలు, గర్భిణులకు వైద్యంతో పాటు సుమారు 90 రకాల మందులు అందుబాటులో ఉంచనున్నారు. వైద్య పరీక్షల రిపోర్టులు వెంటనే అందించేందుకు అధునాతన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనాల ద్వారా పీహెచ్‌సీ వైద్యులు, గ్రామాల్లో ప్రజల చెంతకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో వైద్యం కోసం పేదలు పనులు మానుకోని పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఎమైనా వైద్య పరీక్షలు చేయించుకుంటే ఫలితాల కోసం తిరిగి మరుసటి రోజు తీవ్రవ్యయప్రయాసాలకు గురికావాల్సి వచ్చేది. గ్రామీణ పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం బీపీ, షుగర్ రెగ్యులర్ చెకప్‌లను పైసా ఖర్చు లేకుండా వైద్యం పొందవచ్చు.



బుర్రారెడ్డిపల్లె గ్రామ సచివాలయం

రైతు సేవల్లో ముందడుగు

వ్యవసాయం వదిలేద్దామనుకున్న రైతులు తిరిగి పొలంబాట పడుతున్నారు. సేద్యం గిట్టుబాటు కాదని, పంటలు పండిస్తే అప్పులే మిగులుతాయని అనుకున్న రైతులు నిరాశ నిస్పృహ నుంచి బయట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నదాతలను గట్టెక్కిస్తున్నాయి. గ్రామాల్లో రూ.22.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు కర్షకులకు అండగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో ఎరువులు, రాయితీ విత్తనాలు, విత్తనాలు, ఈ–క్రాప్ బుకింగ్, సున్నావడ్డీ రుణాలు, పంటల బీమా, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు, సీహెచ్‌సీ గ్రూపులకు ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు, రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై సలహాలు సూచనలు ఇచ్చేందు టీవీలను ఏర్పాటు చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు



నూతన కార్యలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను నిర్మించాను. ప్రస్తుతం నిర్మాణాలు పూర్తికావడంతో గ్రామానికే కొత్త కళ వచ్చినట్లుగా ఉంది. గ్రామ ప్రజలు సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–శివరామిరెడ్డి, సర్పంచ్, క్రిష్టిపాడు

రెండు గ్రామాలకు ఉపయోగం



గ్రామ సచివాలయాన్ని యుద్ధప్రాతికపదికన నిర్మించాం. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తోడ్పాటుతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని హంగులతో సచివాలయాన్ని తీర్చిదిద్దాం. బుర్రారెడ్డిపల్లె, రామచంద్రాపురం రెండు కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేశారు. నూతన కార్యలయంలో ప్రజలకు సేవలు మరింత చేరువ కానున్నాయి.

– శ్రీపతి ప్రసాద్, బుర్రారెడ్డిపల్లె

సేవలకు వేళాయే..

- రూ. 1.20 కోట్లతో సచివాలయ భవనాలు పూర్తి
- రేపు ప్రారంభించనున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఉయ్యాలవాడ : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా సాకారమైంది. పాలన వికేంద్రీకరణలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. గతంలో అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలు శిథిలావస్థకు చేరాయి. సిబ్బంది కొరత వేధిస్తూ ఉండేది. ప్రస్తుతం నూతన సచివాలయ భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మండల పరిధిలోని సుద్దమల్ల, మాయలూరు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో రూ. 1.20 కోట్లతో సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి కావడంతో ఈ నెల 28వ తేదీన నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, శాసన మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు.

సచివాలయల్లో 541 సేవలు..

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్దిష్ట కాల వ్యవధిలో 541 సేవలు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజలు నివాసం ఉండే గ్రామంలోనే సేవలు అందుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయంలోనే 13 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా ఇంటర్‌నెట్ సౌకర్యం కలిగిన కంప్యూటర్లు, ప్రింటర్, స్కానర్, ల్యామినేషన్ మిషన్లతో పాటు అవసరమైన ఇతర సామగ్రిని ప్రభుత్వం అందుబాటులో ముంచింది. పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు, ఆర్‌ఓఆర్, ఇంటి పన్ను, ఆస్తి పన్ను, గృహ స్థలం, జనన, మరణ రిజిస్ట్రేషన్లు, ఆధార్‌లో మార్పు, చేర్పులు తదితర వంటి సేవలు అందడంతో పాటు ప్రజలకు వ్యయ ప్రయాసాలు కూడా తగ్గాయి.



సుద్దమల్ల గ్రామ సచివాలయం



మాయలూరు గ్రామ సచివాలయం



ఆర్.జంబులదిన్నె సచివాలయానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

పెద్దకొట్టాల ఎద్దుల ముందంజ



గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం



బండలాగుతున్న ఎద్దులు

గోస్పాడు: ఉగాది పండుగను పురస్కరించుకొని గుమ్మిత మల్లికార్జునస్వామి, శ్రీవీరభద్రస్వామి తిరునాల సందర్భంగా దీబగుంట్లలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు నిర్వహించారు. ఆదివారం న్యూకేటగిరీ విభాగంలో పోటీలు జరిగాయి. పోటీలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి ప్రారంభించారు. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి రికార్డుల కేశవరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేల నగదును గెలుపొందాయి. సంజామల మండలం చిన్నకానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ.30వేలు సొంతం చేసుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం లింగాయపల్లె గ్రామానికి చెందిన సురేష్‌యాదవ్ ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.20వేలు దక్కించుకున్నాయి. అదే జిల్లా జె.కొట్టాలపల్లె గ్రామానికి చెందిన కార్తీక్‌రెడ్డి ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచి రూ.10వేలు సొంతం చేసుకున్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ననాగిరెడ్డి, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రిటైర్డు వీఆర్‌ఓ మామహేశ్వరరావు పాల్గొన్నారు.

మసీదులకు జంఖానాల విరాళం



జంఖానాలు అందజేస్తున్న అంజుమన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో 87 మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించుకోవడానికి జంఖానాలను ఆదివారం విరాళంగా అందజేశారు. సంస్థ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ 87 మసీదులకు రూ.4.75లక్షల విలువజేసే జంఖానాలను ఒక్కో మసీదుకు రెండు చొప్పున అందజేశామని చెప్పారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌సమ్మద్, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు అఫీజ్ అంజాద్‌బాషా, అబ్దుల్‌హక్, గౌస్, మున్నా, వాహత్, మౌలానా అబ్దుల్‌హ పాల్గొన్నారు.

తీగల మరమ్మతులకు నిధుల మంజూరు

నంద్యాల(రూరల్): నంద్యాల జిల్లా పరిధిలోని గ్రామాలు, పట్టణాలకు అనుసంధానంగా ఉండే రహదారులపై వేలాడుతున్న విద్యుత్ తీగల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసిందని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా పరిధిలోని రహదారులపై వేలాడుతున్న విద్యుత్ తీగల మరమ్మతుల కోసం పదిరోజుల కిందట ప్రతిపాదనలు పంపామన్నారు. స్పందించిన ప్రభుత్వం వెంటనే రూ.3 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ నిధలను జిల్లాలోని నంద్యాల పట్టణం, రూరల్, ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, చాగలమర్రి, గడివేముల, కోవెలకుంట్ల, మహానంది, పాణ్యం, రుద్రవరం, సంజామల, శిరివెళ్ల, వెలుగోడు మండలాల పరిధిలో రహదారులపై ప్రమాదకరంగా ఉన్న 33కేవీ విద్యుత్ లైన్లు, 11కేవీ విద్యుత్ లైన్ల పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే గత వారంలో జిల్లాలో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల మరమ్మతుల కోసం ఆయా మండల విద్యుత్ అధికారులతో సేకరించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామని పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీపై చర్యలు అన్యాయం

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం బీజేపీ ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనిస్ విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు దేశ ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి ఆ పార్టీ నాయకులు భయపడుతున్నారన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల్లో రాహుల్‌గాంధీకి పెరుగుతున్న క్రేజీని తగ్గించేందుకే ఇలా దురాగతానికి ఒడిగట్టారని మండిపడ్డారు. బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని, ఫలితం తప్పకుండా అనుభవించేలా చేస్తారన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

మౌనస్వామి ఆరాధనోత్సవం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ఫిల్టర్‌బెడ్ సమీపంలో ఉన్న మౌనస్వామి ఆశ్రమంలో ఆదివారం 46వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కార్యనిర్వాహక సభ్యులు, భక్తులు మౌనస్వామి జీవసమాధికి మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం చేసిన తర్వాత లోకకల్యాణార్థం పాశుపత హోమం నిర్వహించారు. అనంతరం ఆశ్రమ గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ స్వామి వారి గురించి వివరించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్సీ గంగుల, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: నాలుగేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యమిస్తూ సఫల రాష్ట్రంగా ప్రగతి పథంలో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పని చేస్తున్నారని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కొనియాడారు. పట్టణంలో రూ. 3కోట్లతో 30 నుంచి 50 పడకల ఆసుపత్రిగా ఆధునికీకరించిన నూతన భవనంతో పాటు పలు అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. ఇందులో భాగంగాపట్టణం, రూరల్ మండలం క్రిష్ణాపురం, పాత కందుకూరు గ్రామాల్లో పలు సీసీ రోడ్లు, డ్రైజేజీలు, ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించి ప్రజలకు అంకితమిచ్చారు. వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలోనే వంద పడకలకు పెంచేలా కృషి చేస్తామని చెప్పారు. ఆసుపత్రి ఎదుట సీసీ రోడ్లు వేసేందుకు ఎంపీ నిధుల నుంచి రూ. 25 లక్షలు మంజూరు చేసేందుకు ఎంపీ ఒప్పుకున్నారని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. చాగలమర్రి మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.12 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే పనులు చేపట్టి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గంగుల రామిరెడ్డి ఉన్నారు.



పుచ్చకాయలపల్లెలో ఎంపీ ల్యాండ్స్‌తో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి వ్యవసాయ శాఖ అధికారులకు తాళాలు అప్పగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి దేశంలోనే నూతన శకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బోడెమ్మనూరు సచివాలయ పరిధిలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలు, గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రూ. 12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, అలాగే రూ. 65 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో పుచ్చకాయలపల్లె, బోడెమ్మనూరు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీలో ఆందోళన మొదలైందని, తమకు అధికారం దక్కదని అక్కసుతో బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతున్నారు. తమకు మాత్రమే సాధ్యమైన లాబీయింగ్, ఓటుకు నోటు కార్యక్రమాలకు రాష్ట్రంలో మళ్లీ తెరదీశారని మండిపడ్డారు. అనంతరం పదవీ కాలం ముగియనుండటంతో బోడెమ్మనూరు గ్రామస్తులు ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మధుసూదనదేవి, బందెల సువర్ణ, సింగిల్‌విండో అధ్యక్షులు పోచా వెంకటరెడ్డి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యుడు బాలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, నాయకులు మార్తుల పెద్దపుల్లారెడ్డి, బావిరెడ్డి తిరుపతిరెడ్డి, దండేలా ఆదినారాయణరెడ్డి, లాలమ్మగారి హుసేనయ్య, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సరాబు దస్తగిరి, గిరిధర్, ఖాతా దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రపల్లిలో 31 నుంచి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో ఈ నెల 31 వ తేదీ నుంచి శ్రీరామనవమి సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతగా నిలిచిన వృషభాలకు రూ. 25,116 నగదు బహుమతి అందజేస్తామన్నారు. రెండవ, మూడవ, నాలుగో స్థానంలో నిలిచిన వృషభాలకు వరుసగా రూ. 15,116, రూ. 10,116, రూ. 5,116 చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. ఏప్రిల్ 1 వ తేదీ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు రూ. 45,116, రూ. 40,116 చొప్పున అందజేస్తామన్నారు. అదేవిధంగా మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదో స్థానంలో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.30,116,రూ.20,116,రూ. 15,116, రూ. 10,116, రూ. 6,116, రూ. 5,116 చొప్పున అందజేస్తామని వివరించారు.